చినుకు పడితే చిత్తడే..!

చినుకు పడితే చాలు గ్రామీణ రోడ్లు ఛిద్రమైపోతున్నాయి. గుంతల్లో నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. వర్షాలకు మట్టి రోడ్లు కొట్టుకుపోయి రొచ్చురొచ్చుగా మారుతున్నాయి. తారురోడ్లలో సైతం గుంతలు ఏర్పడి అధ్వానంగా మారడంతో వర్షపు నీరు నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. దీంతో గ్రామీణ ప్రజలు ఆ రోడ్లలో అడుగుతీసి అడుగు పెట్టలేకపోతున్నారు. అడుగు పెట్టాలంటే అవస్థలు పడాల్సిందే. దుస్థికి చేరిన రోడ్లకు మరమ్మతు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా రోడ్లపై నడక నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

- బురదమయవుతున్న గ్రామీణ రోడ్లు
- ఆ రోడ్లలో గ్రామీణ ప్రజల అవస్థలు వర్ణనాతీతం
- పట్టించుకోని అధికార యంత్రాంగం


బ్రాహ్మణపల్లె సమీపంలో అధ్వానంగా మారిన రోడ్డు

వెదురుకుప్పం : మండలంలోని సీఆర్‌కండ్రిగ నుంచి బ్రాహ్మణపల్లె మీదుగా రామచంద్రాపురం మండలం అనుప్పల్లెకు వెళ్లే రహదారి దుస్థితికి చేరింది. అక్కడక్కడ గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. దీంతో వాహనాలు నడిపేందుకు వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కమ్మకండ్రిగ గ్రామం వద్ద రోడ్డుపై గుంత ఏర్పడి వర్షపు నీరు చేరడంతో మడుగును తలపిస్తోంది. బ్రాహ్మణపల్లె సమీపంలోని కురివికుప్పం రోడ్డు వద్ద రోడ్డు కోతకు గురైంది. కలిమిచేను గ్రామానికి వెళ్లే రోడ్డు వర్షానికి ఛిద్రమైపోయింది. మట్టి రోడ్డు గనుక ఎక్కడ జారిపడతామోనన్న ఆందోళన కలుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అనుప్పల్లె ప్రధాన రహదారి నుంచి కురివికుప్పం గ్రామానికి వెళ్లే రోడ్డు మట్టి రోడ్డు కావడంతో వర్షానికి రొచ్చుగా మారి బురదమయమైంది. కొమరగుంట ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డుపై అడుగు పెట్టలేని పరిస్థితి. బాలుపల్లె రోడ్డు దుస్థితికి చేరింది. అల్లంవారికండ్రిగ, వేపేరి, ఉప్పరపల్లె, వెదురుకుప్పం ఎస్టీ కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. గ్రామీణ రోడ్లు రూపురేఖలు కోల్పోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆనవాళ్లు కోల్పోయి నడిచేందుకు వీలులేకుండా తయారయ్యాయి. దేవళంపేటలో చినుకుపడితే చాలు రోడ్డుపై వర్షపు నీరు నిలిచి మడుగును తలపిస్తోంది. దీంతో ప్రయాణికులు రోడ్లపై అడుగు పెట్టాలంటే ఒళ్లు జలదరిస్తోందని అంటున్నారు.

పట్టించుకోని అధికారులు..

చిన్నపాటి వర్షాలకు గ్రామీణ రోడ్లు రొచ్చురొచ్చుగా మారుతున్నాయి. దీంతో ప్రజలు ఆ రోడ్లపై ప్రయాణం సాగించాలంటే భయపడుతున్నారు. మట్టిరోడ్ల పరిస్థితి మరింత దారుణం. గుంతల్లో వర్షపునీరు నిలుస్తుండడంతో నడిచి వెళ్లడానికి అసలు వీలు కావడం లేదని జనం వాపోతున్నారు. అధికారులు మాత్రం రోడ్లలో కనీస మరమ్మతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తారురోడ్లలో ఏర్పడిన గుంతలను పూడ్చాలని, అలాగే మట్టిరోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



బురదగుంటను తలపిస్తున్న అనుప్పల్లె రోడ్డు, పచ్చికాపల్లం పేట సమీపంలోని ముత్యాలమ్మ గుడి మలుపు వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఘనంగా ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఊరేగింపు


ప్రత్యేక అలంకరణలో శ్రీద్రౌపదీ ధర్మరాజులు స్వామివారు

కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసిన శ్రీద్రౌపదీ ధర్మరాజులస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా రెండవ రోజు శనివారం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. వడ్డెర కులస్తులు ఉభయదారులుగా వ్యవహరించి సాయంత్రం అమ్మవారికి సారెను సమర్పించారు. రాత్రి అర్చకులు అమ్మవారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పాలు, స్వర్ణాభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి పురవీధుల్లో బాణసంచా పేలుళ్ల నడుమ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్, కమిటీ సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, కృష్ణయ్య, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీనివాసుడి కటాక్షం


మాడవీధుల్లో భక్తులను కటాక్షిస్తున్న శ్రీనివాసుడు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీవారి గ్రామోత్సవంలో భాగంగా శనివారం వేకువజామున సుప్రభాత సేవతో శ్రీనివాసస్వామిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు మంగళ హారతులు ఇచ్చి ఏకాంత సేవ నిర్వహించారు.

క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు


అలంకరణలో వేంకటేశ్వర స్వామి

నింద్ర: మండలంలోని నింద్ర క్రాస్ రోడ్డు వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నైలోని వడపళని చెందిన భక్తులు తిరుమలకు కాలినడకన బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మార్గమధ్యలోని నింద్ర క్రాస్ వద్ద వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు తిరుమలకు బయలుదేరారు.

లక్ష్మీ నరసింహ స్వామికి అభిషేకం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి భక్తి ప్రపత్తులతో ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారికి పాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని సుగంధ పరిమళాలతో కూడిన వివిధ రకాల పుష్పాలు, తులసీ దళాలతో ఆకర్షణీయంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర


పుత్తూరులో సాగుతున్న రథయాత్ర

పుత్తూరు: పట్టణంలోజగన్నాథ రథయాత్ర వైభవంగా శనివారం సాయంత్రం నిర్వహించారు. స్థానిక శ్రీకృష్ణ నిలయానికి చెందిన ఇస్కాన్ భక్తబృందం ఆధ్వర్యంలో బ్రహ్మంగారి ఆలయం నుంచి నగరం రోడ్డు, కాపువీధి, బజారువీధి మీదుగా యాత్ర కొనసాగింది. మధ్యాహ్నం 3.30 గంటలకు గోపూజ, తులసిపూజ నిర్వహించారు. 4 గంటలకు ప్రారంభమైన రథయాత్ర సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. అనంతరం జగన్నాథ లీలలు, ప్రవచనాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలపించిన అఖండ హరినామ సంకీర్తనలతో శ్రీకృష్ణ నిలయం భక్తిపారవశ్యంతో తరించింది.

పిచ్చిమొక్కలు తొలగించండి


బుగ్గకాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

విజయపురం : బుగ్గకాలువలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని రైతులు కోరుతున్నారు. కేవీపురం, కాళికాపురం, గంగమాంబపుర మీదుగా వెళ్తున్న బుగ్గకాలువలో పిచ్చిమొక్కలు ఉన్నాయి. దీంతో వర్షపునీరు చెరువులోకి చేరడం లేదు. అంతేకాకుండా పిచ్చిమొక్కలు ఉండడంతో వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తోందని స్థానిక రైతులు చెబుతున్నారు. ఈ కాలువను సరి చేస్తే కొన్ని వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని, అంతేకాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న చెరువులు, గుంటలు నిండుతాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు బుగ్గకాలువలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం : మాతాశిశు మరణాలు అరికట్టాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం కిల్కారీ అండ్ మొబైల్ అకాడమీని ఏర్పాటు చేసిందని తిరుపతి రీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ కీర్తి తెలిపారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలకు కిల్కారీ అండ్ మొబైల్ అకాడమీపై వైద్యాధికారి మోహన్‌కృష్ణ, లోకేష్ ఆధ్వర్యంలో ట్రైనింగ్ కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ మొబైల్ అకాడమీ నంబర్ 14424కు ఫోన్ చేస్తే గర్భిణులకు ప్రసవం వరకు వారు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, తీసుకోవాల్సిన వైద్య పరీక్షలు వివరిస్తారని తెలిపారు. బిడ్డలో నిమోనియా, అతిసార లక్షణాలు కనిపిస్తే తక్షణమే ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కిల్కారీ అండ్ మొబైల్ అకాడమీ ప్రాధాన్యత గురించి వివరించారు. అనంతరం మండల కేంద్రం వరకు కిల్కారీ అండ్ మొబైల్ అకాడమీ గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుశీల, మురళి, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విస్తారంగా సజ్జ పంట సాగు


అత్తూరులో సాగులో ఉన్న సజ్జ పంట

నింద్ర: మండలవ్యాప్తంగా సజ్జ పంట విస్తారంగా సాగైంది. ఆరుతడి పంటగా సజ్జను సాగు చేసినట్లు అగరం, అరూరు, నింద్ర, అత్తూరు, ఎలకాటూరు గ్రామాల రైతులు చెబుతున్నారు. గతవారం రోజులుగా వర్షాలు పడుతుండడంతో సజ్జ పంట ఏపుగా పెరుగుతుందని సంతోషపడుతున్నారు. సజ్జ సాగుకు పెద్దగా ఖర్చు ఉండదు. ఈసారి పంట దిగుబడి బాగా వస్తుందనే ఆశతో రైతులు ఉన్నారు. నీటి సౌకర్యం లేని రైతులు కూడా సజ్జ పంట సాగు చేశారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా పార్థేవ శెట్టి


పార్థేవ శెట్టి

కార్వేటినగరం : భారతీయ జనతా పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా కొల్లాగుంట గ్రామానికి చెందిన పార్థేవ శెట్టిని నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా మార్కెట్ యార్డ్ కోకన్వీనర్ నడింపల్లి యువరాజు తెలిపారు. శనివారం కొల్లాగుంట గ్రామంలో బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో మండల ఉపాధ్యక్షుడిగా పార్థేవశెట్టిని నియమించారు. ఈ సందర్భంగా యువరాజు మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి నిత్యం కృషి చేస్తున్న పార్థేవశెట్టిని మండల ఉపాధ్యక్షుడిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నూతనంగా మండల ఉపాధ్యక్షుడిగా నియమితులైన పార్థేవ శెట్టిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జీడీనెల్లూరు అసెంబ్లీ ఇన్‌చార్జ్ రాజేంద్ర, మండల అధ్యక్షుడు రామిశెట్టి రాజశేఖర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీటలు వారిన తహసీల్దార్ కార్యాలయం


భవనం ఉరవడంతో కార్యాలయంలో నిలిచిన వర్షపునీరు

విజయపురం : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ గోడలు బీటు వారాయి. దీంతో వర్షం పడితే భవనం ఉరుస్తోంది. ఈ భవనం నిర్మించి కేవలం 16 ఏళ్లు అయింది. ఒక భవనం నిర్మిస్తే కనీసం పాతికేళ్లు అయినా బాగుండాలి. కానీ ఈ భవనాన్ని అప్పట్లో నాసిరకంగా నిర్మించడంతో గోడలు బీటలు వారాయి. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పెట్టుకోవడానికి కూడా సరైన గదులు లేవు. ఇదివరకు ఎంతోమంది జిల్లా అధికారులు మండల పర్యటనకు విచ్చేశారు. ఈ భవన పరిస్థితిని స్థానిక అధికారులు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాయ భవనానికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



బీటలు బారిన గోడలు

నిబంధనలకు విరుద్ధంగా కళాశాలల నిర్వహణ


విద్యార్థులను పంపివేయాలని నారాయణ కళాశాల లెక్చరర్‌కు సూచిస్తున్న విద్యార్థి సంఘం నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రమైన చిత్తూరులోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా రెండో శనివారం తరగతులు నిర్వహించినట్టు ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి అఖిల్ ఆరోపించారు. ఆ సంఘ నాయకులు శనివారం చిత్తూరు నగరంలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలలను ముట్టడించారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని ఆఫీసర్స్ లైన్‌లో ఉన్న నారాయణ, మురుగానపల్లిలోని వివేకానంద, పలు కళాశాలల్లో శనివారం తరగతులు నిర్వహించినట్టు తెలిపారు. రెండో శనివారం, ప్రభుత్వ సెలవు దినాల్లో తరగతులు నిర్వహించకూడదనే నిబంధన ఉన్నప్పటికీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ విషయం ఇంటర్మీడియట్ అధికారులకు తెలిసినప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

రాంగ్ రూట్ గొడవలు

తిరుపతి అర్బన్: శ్రీనివాస సేతుపై రాంగ్ రూట్ గొడవలు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు త్రుటిలో తప్పుతున్నాయి. అయినా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలను తగ్గించడానికి గత ప్రభుత్వంలో శ్రీనివాస సేతును నిర్మించారు. దీంతో ట్రాఫిక్ సమస్య చాలావరకు తగ్గింది. అయితే వంతెన నుంచి బస్టాండ్‌లోకి వెళ్లే మార్గంలో కేవలం ఆర్టీసీ బస్సులు మాత్రమే వెళ్లాల్సి ఉంది. అయినప్పటికీ పలు ప్రైవేటు వాహనాలు వెళ్తున్నాయి. మరోవైపు బస్టాండ్‌లో నుంచి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు రాంగ్‌రూట్‌లో వంతెన పైకి వచ్చేస్తున్నారు. దీంతో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సులకు నిత్యం ప్రమాదాలు త్రుటిలో తప్పుతున్నాయి. దీనిపై గతంలో పలువురు ప్రయాణికులు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం కనిపించడం లేదు.

ప్రత్యేక నిఘా పెడతాం..

శ్రీనివాస సేతుపై రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనాలపై దృష్టి సారిస్తాం. వారిపై జరిమానాతోపాటు చట్టపరమైన చర్యలు చేపడుతాం. వంతెనపై నుంచి బస్టాండ్‌లోకి ఆర్టీసీ బస్సులకు మాత్రమే అనుమతి ఉంది. కార్లకు అనుమతి లేదు. బస్టాండ్ నుంచి వంతెనపై రాంగ్ రూట్‌లో వెళ్లే వాహ నదారుల పట్ల సీరియస్‌గా పరిగణిస్తాం.

– డీఆర్ నాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, తిరుపతి